ఐటీడీఏ పీఓ ఆదేశాలు బేఖాతర్

ఐటీడీఏ గ్యాస్ గోడౌన్ మేనేజర్ మార్పు ఉత్తిదే

విశాలాంధ్ర-పాడేరు : గ్యాస్ ఉచిత కనెక్షన్లకు వేలాది రూపాయలు వసూళ్లు చేసిన పాడేరు ఐటీడీఏ గ్యాస్ ఏజెన్సీ మేనేజరుపై చర్యలు తీసుకొని, లబ్ధిదారులకు నగదు తిరిగి చెల్లించే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కో-కన్వీనర్ అమర్ డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఉజ్వల పథకంలో భాగంగా మంజూరైన కొత్త గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వాల్సి ఉండగా లబ్ధిదారుల నుండి రెండు వేల రూపాయలు నగదు తీసుకున్నట్లు పత్రికల్లో కథనాలు రావడంతో మార్చి 25వ తేదీన పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్పందించి ఒక పత్రికా ప్రకటన విడుదల చేసారని, పాడేరు ఐటీడీఏ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ మేనేజరును అక్కడ విధుల నుండి తప్పించి, మేనేజరుగా మరొకరికి బాధ్యతలు అప్పగించాలని, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లకు రెండు వేల రూపాయలు నుండి వేయి వరకు వసూలు చేసిన అంశంపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని గిరిజన సంక్షేమ ఎస్డీసిని విచారణ అధికారిగా నియమిస్తూ పీఓ అభిషేక్ ఆదేశాలు జారీచేశారు. విచారణ ఏ దశలో ఉందో తెలియదు కానీ సదరు గ్యాస్ ఏజెన్సీ మేనేజరు స్థానంలో మరో వ్యక్తిని మార్చలేదని, ఆరోపణలు ఎదుర్కొంటున్న మేనేజర్ యధావిధిగా కొనసాగడాన్ని అమర్ తప్పుబట్టారు. మార్చి 25వ తేదీన ఐటీడీఏ పీఓ ఇచ్చిన ప్రకటన ఎందుకు అమలు జరగలేదో అధికారులు విచారణ జరిపించాలని, అదే విధంగా ఇటీవల ఐటీడీఏలో సరెండర్లు, సస్పెన్షన్లు చేసిన అధికారులు కొద్ది వారాల వ్యవధిలో తిరిగి అదే స్థానంలో పోస్టింగులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఐటీడీఏ గ్యాస్ గొడౌన్ మేనేజరుపై చర్యలు తీసుకొని, లబ్ధిదారుల నుండి తీసుకున్న నగదు వెనక్కు ఇప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

నూరు శాతం పోలింగ్‌కు సహకారం అందించండి

అరకు రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్

విశాలాంధ్ర-అరకులోయ: సార్వత్రిక ఎన్నికలలో నూరు శాతం పోలింగ్ జరిగే విధంగా సహకారం అందించాలని అరకు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారి, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ స్పష్టం చేసారు. శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు, ప్రచార కార్యక్రమాల అనుమతులు, ర్యాలీలు, సభలు, సమావేశాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలుచేస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు విజవంతంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ ప్రక్రియ కీలకమన్నారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేయడంలో అభ్యర్థులు అవగాహన పెంచుకోవాలని చెప్పారు. ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సభలు, సమావేశాలు నిర్వహించకూడదని చెప్పారు. ర్యాలీలకు, సభలు నిర్వహణకు 48 గంటల ముందుగా రిటర్నింగ్ అధికారి నుండి అనుమతులు పొందాలని స్పష్టం చేసారు. ముందుగా దరఖాస్తు చేసిన పార్టీలకు ముందుగా అనుమతులు జారీ చేస్తామని చెప్పారు. ఫారం -1లో నామినేషన్ స్వకరణపై ప్రకటన చేస్తామని అన్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరిస్తామని చెప్పారు. నామినేషన్ వేస్తున్న అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. నామినేషన్లు చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన సమయాన్ని అనుసరించి నామినేషన్లు దాఖలు చేయవలసి ఉంటుందన్నారు. రాజకీయ నేతల వద్ద పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులను, సబ్బందిని తిరిగి సొంత శాఖకు పంపించాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున డిప్యూటేషన్లు రద్దయ్యాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తాహాశీల్దార్ కె. సుధాకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి అనేక సేవలందించిన స్ఫూర్తిప్రదాత జగ్జీవన్‌రామ్

కలెక్టర్ విజయ సునీత

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : దేశానికి అనేక రకాలుగా సేవలు అందించి మనందరికీ స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన గొప్ప వ్యక్తి డా.బాబూ జగ్జీవన్ రాం అని కలెక్టర్ ఎం.విజయ సునీత కొనియాడారు. భారతదేశం పునాదికి, భవిష్యత్తుకు నాంది పలికిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు, భారత తొలి ఉప ప్రధాని డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కలెక్టర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ మనందరికీ స్ఫూర్తిని ఇచ్చిన గొప్పవ్యక్తి అన్నారు. స్వతంత్ర సమర యోధుడిగా ఆయన చేసిన పోరాటం, రాజ్యాంగ సృష్టిలో, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి చేసిన సేవలు ఆదర్శమన్నారు. సుమారుగా 30సంవత్సరాలపాటు రాజకీయంగా వివిధ హెూదాల్లో పనిచేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం తొలి కార్మిక మంత్రిగా, రక్షణ, సమాచార, రైల్వే, రవాణా, ఆహార, వ్యవసాయ శాఖల మంత్రిగా, దేశ తొలి ఉపప్రధానిగా అమూల్యమైన సేవలు దేశానికి అందించారని వివరించారు. వ్యవసాయశాఖ మంత్రిగా హరిత విప్లవం విజయవంతం చేయడంలో జగ్జీవన్ రామ్ కీలక పాత్ర పోషించారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భారత రాజ్యాంగం అందించిన స్ఫూర్తితో ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజల తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించు కోవాలని కలెక్టర్ ఈసందర్భంగా కోరారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ బి.పద్మావతి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జనార్ధనరావు, ఎస్డిసి వివిఎస్ శర్మ, తహసిల్దార్ అరుణ కుమారి, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో దాహం కేకలు

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన

విశాలాంధ్ర-పాడేరు : పాడేరు గుడివాడ గ్రామంలో మంచినీటి ఇక్కట్లు తీర్చాలని మహిళలు ఆందోళనకు దిగారు. సుమారు వేయి కుటుంబాలు నివాసం ఉంటున్న తమ గ్రామానికి ఒక్క బోరు మాత్రమే ఉందని, వేయి మందికి ఒక్క బోరు నుండి వచ్చే నీరు ఏవిధంగా సరిపోతుందని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కో-కన్వీనర్ అమర్ మాట్లాడుతూ ఇంటింటికీ కుళాయి జల్ జీవన్ మిషన్ పేరుతో ఆర్భాటం చేశారు తప్ప ప్రజలకు ఒరిగింది ఏమి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఉచితంగా సరఫరా చేస్తున్న నీళ్ల ట్యాంకర్ ఎన్నికల నిబంధన పేరుతో నిలుపుదల చేశారన్నారు. గుడివాడ మెట్ట గ్రామానికి మంచినీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇంటింటికి కుళాయి పనులు వేగవంతం చేయాలని అమర్ డిమాండ్ చేశారు.

సాడిపేటవీధిలో నీటి సమస్య పరిష్కారం

కుండీ నిర్మాణమే గాక నీటిని తెచ్చుకునేందుకు సౌకర్యవంతంగా మెట్లు ఏర్పాటు చేసిన సర్పంచ్ పుష్పలత

విశాలాంధ్ర-చింతపల్లి : మండల కేంద్రంలోని సాడిపేట వీధిలో నీటి సమస్యకు పరిష్కారం లభించింది. ఏళ్ల తరబడి ఊటనీటి ఆధారంగా నీటి సమస్యతో సతమతమవుతున్న సాడీపేట వాసులు ప్రతీ ఏటా ఎదుర్కొంటున్న నీటి సమస్యకు చెక్ పెట్టాలనే సత్సంకల్పంతో స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత ప్రత్యేక చొరవతో ఊటనీరు వృధా పోకుండా కుండి ఏర్పాటు చేయడమే కాక, లోతట్టు ప్రాంతంలో ఉన్న నీటిని తెచ్చుకునేందుకు అసౌకర్యంగా ఉన్న ఆ ప్రాంతంలో సిమెంటు రహదారితో పాటు మెట్లు ఏర్పాటు చేసి కుండీ నుండి సురక్షితమైన నీటిని తెచ్చుకునేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించారు. దీంతో సాడిపేట వీధికి చెందిన ప్రజల నీటి సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. నీటి సమస్య పరిష్కారం కావడంతో సర్పంచ్ పుష్పలతకు, ఆ పనులను సకాలంలో పూర్తిచేసిన గుత్తేదారులకు సాడిపేట వాసులు అభినందనలు తెలిపారు.

టీడీపీ రెబల్ అభ్యర్థి సివేరి అబ్రహం ప్రచారం

విశాలాంధ్ర-ముంచంగిపుట్టు : రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం రెబల్ అభ్యర్థి సివేరి అబ్రహం గెలుపు ఖాయమని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పార్టీ మాజీ మండల అధ్యక్షులు నీలకంఠం పాత్రో అన్నారు. వారు మాట్లాడుతూ వారి బృందాలతో మండలంలో శుక్రవారం జర్రెల పంచాయితీ కేంద్రంలో అబ్రహం గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించారు. ప్రజల నుండి విశేష స్పందన ఆదరణ లభిస్తుందని 2024 సార్వత్రిక ఎన్నికల్లో అబ్రహం గెలుపు ఖాయమని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని వారు అన్నారు విద్యావంతుడైన అబ్రహం గెలుపు కోరుతూ మండలంలో నుండి నలుమూలల నుండి విశేషమైన స్పందన లభిస్తుందని వారు తెలియజేశారు ఎన్నికలు ఏ క్షణంలో వచ్చిన అబ్రహం గెలుపు కోసం ప్రజలందరూ సర్వం సిద్ధంగా ఉన్నామని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు వంతల మోదునో మండల సిబిఎస్ యువ నాయకులు కిముడు రామదాసు పార్టీ సీనియర్ నాయకులు కొచ్చో రామదాసు సిబిఎస్ యువ నాయకులు వంతల రఘునాథ్ కూడా సుబ్రహ్మణ్యం నైకం దొన్నో సిద్దేశ్వరరావు తిలక్ భగీరథ లక్ష్మణరావు త్రినాధ్ జోయో సూర్య లోకి టీమ్ సోషల్ మీడియా మండల్ కన్వీనర్ పాంగి హరీష్ మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జోరందుకున్న పించన్ల పంపిణీ

చిట్టచివరి స్థానం నుండి నాల్గవ స్థానానికి... కలెక్టర్ అభినందన

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : కలెక్టర్ విజయ సునీత చొరవతో, పింఛన్ పంపిణీ ఇన్చార్జ్ అధికారుల ప్రత్యేక పర్యవేక్షణతో, ఎంపీడీవోల కృషితో సచివాలయ సిబ్బంది చేపట్టిన పింఛన్ల పంపిణీ జోరందుకుంది. నిన్న రాత్రికి 72.25% మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేసి 26 వ స్థానంలో ఉన్న అల్లూరి జిల్లా ప్రస్తుతం 94.47%తో నాల్గవ స్థానానికి చేరుకుంది. 1,27,894 మంది లబ్ధిదారులకుగాను లక్ష 20 వేల 825 మందికి పింఛన్లు పంపిణీ చేయడం ద్వారా రాష్ట్రంలో నాల్గవ స్థానానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఫించన్ల పంపిణీని టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కలెక్టర్ పింఛన్ పంపిణీ ఇంచార్జ్ అధికారులైన జెసి భావన వశిష్ఠ్, ఐటీడీఏ పీవోలు వి అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య, సబ్ కలెక్టర్లు రాత్రి రెడ్డి, ప్రసన్న కుమార్, డిఆర్డిఏ పిడి మురళి, 22 మండలాల ఎంపిడిఓ లను, సచివాలయాల సిబ్బందిని అభినందించారు. అదేవిధంగా మిగిలిన లబ్ధిదారులకు కూడా ఫించను పంపిణీ పూర్తి చేయాలని, ఆదే స్ఫూర్తితో అభయహస్తం ఫించన్లు కూడా పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి : ఎస్ఐ

విశాలాంధ్ర-సీలేరు : ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని సీలేరు ఎస్సై జె.రామకృష్ణ కోరారు. శుక్రవారం దుప్పుల వాడ పంచాయతీ అగ్రహారం గ్రామసులతో సమావేశ మయ్యారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లా డుతూ ఎటువంటి అసాంఘిక కార్యకలా పాలకు, గొడవలు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటా మన్నారు. ముఖ్యంగా యువత చెడు మార్గాలవైపు నడవకుండా ఉన్నతమైన చదువులు అభ్యసించి గ్రామానికి అదే విధంగా ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు.

తెదేపా శ్రేణులు నా వెంటే ఉన్నారు

తెదేపా పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్ ఈశ్వరి

విశాలాంధ్ర-చింతపల్లి : తెలుగుదేశం పార్టీ అధిష్టానం తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయకున్నా పార్టీ శ్రేణులు తన వెంటే ఉన్నారని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి అన్నారు. శుక్రవారం చింతపల్లి మండలంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ క్రమంలో కొమ్మంగి పంచాయతీలోని గంధాల వీధి గ్రామంలో ఒక వివాహ వేడుకకు ఆమె హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గడచిన ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వం పై అలుపెరుగని పోరాటం చేసి మన్య ప్రాంతంలో తెదేపాను బలోపేతం చేసేందుకు కృషిచేసిన తన వెంటే పార్టీ శ్రేణులు ఉన్నారని, నిరంతరం పార్టీ కోసం పనిచేసే తనను కాదని పార్టీతో సంబంధం లేని వ్యక్తిని తెరమీదకు తీసుకువచ్చి పార్టీ సీటు కేటాయించడం ఎంతవరకు సమంజసం అన్నారు. అభ్యర్థిత్వం విషయంలో పార్టీ పునరాలోచన చేయాలని, పార్టీ శ్రేణుల అభిప్రాయం మేరకు విజయం సాధించే అవకాశం ఉన్న తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని పార్టీ అధిష్టానానికి ఆమె విజ్ఞప్తి చేశారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర-పార్వతీపురం : దివంగత మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతిసందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే జోగారావు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. భారత దేశానికి ఉప ప్రదానిగా బాబూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలను, నిమ్న జాతుల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం ప్రజాప్రతినిధులు, వైఎస్సార్సీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.

బాబూజగ్జీవన్‌రామ్ 117వ జయంతి

సందర్భంగా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ మరియు సాధికారితశాఖ ఆధ్వర్యంలోశుక్రవారం ఆయన జయంతి వేడుకలు నిర్వహించారు.జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక జ్యోతిప్రజ్వలన చేసి బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బాబూ జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి కేశవనాయుడు, జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ, సాధికారిత అధికారి గయాజుద్దీన్, జిల్లా మత్స్యశాఖఅధికారి తిరుపతయ్య, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భారతదేశ ఉప ప్రధానిగా కీర్తిశేషులు బాబు

జగజీవన్‌రామ్ చేసిన సేవలు ప్రశంసనీయమని టిడిపి, జనసేన, బీజేపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర తెలిపారు. శనివారం బాబుజగజ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాలకు ఆయన చేసిన సేవలను, దళితులకు ఆయన చేసిన సేవలను ఆయనతోపాటు పలువురు నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన టిడిపి బిజెపి జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారతదేశ ఉప ప్రధానిగా కీర్తిశేషులు బాబు జగజీవన్‌రామ్ చేసిన సేవలు ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ పురపాలక సంఘం అధ్యక్షురాలు డి.శ్రీదేవిలు తెలిపారు. శనివారం బాబు జగజ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాలకు ఆయన చేసిన సేవలను ఆయన కొనియాడారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బెలగాం : స్థానిక బైపాస్ రోడ్డులో గల

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రాం 117వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖులు ఆయన విగ్రహానికి పార్వతీపురం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బత్తిన మోహనరావు, ఎఐటియుసి నాయకులు ఆర్. కుమార్ తదితరులు జగజ్జీవన్ రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగజ్జీవన్ రాం జీవితమంతా దేశం కోసం త్యాగం చేసి, బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. గొప్ప రాజకీయ వేత్తగా సామాజిక సమానత్వం కోసం జీవిత కాలం పోరాడారని పలువురు నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్. దుర్గారావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జమ్మాన ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు చౌక్కాపు వెంకటరమణ, పి. రవికుమార్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు అందజేశాం

ఎమ్మెల్యే పీడికరాజన్న దొర మామిడి శ్రీనివాసరావు, రంగనాయుడులు ఉద్ఘాటన

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో కాశీపట్నం కొండరేజేరు గ్రామ పంచాయతీలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పీడికరాజన్నదొర మామిడి శ్రీనివాస రావు, మామిడి రంగనాయుడు ఐదేళ్ల పాలనలో అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందజేశారని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం మక్కువ మండలం కాశీపట్నం మరియు కొండరేజూరు గ్రామంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం మావుడి సోదరులతో సాలూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర కలిసి ప్రచారం నిర్వహించారు కాశీపట్నం, కొండరేజూరు గ్రామస్తులు పెద్దయెత్తున పాల్గొని పూల మాలలతో ఘన స్వాగతం పలికి బ్రహ్మ రథం పట్టారు. ప్రజలంతా సీఎం జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు మద్దతు తెలపాలని, రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి జరగాలంటే రెండు బటన్లు ఫ్యాన్ గుర్తుమీద నొక్కి అత్యధిక మెజారిటీతో వైసీపీని గెలిపించాలని గ్రామస్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పీడిక రాజన్న దొర మామిడి శ్రీనివాసరావు మావిడి రంగునాయుడు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులు గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైసీపీలో 50 కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర పార్వతీపురం టౌన్: పురపాలక సంఘం 10వ వార్డుకు చెందిన 50 టీడీపి కుటుంబాలు శుక్రవారం తెలుగుదేశం పార్టీని వీడి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో వైసీపీ పార్టీలో చేరడం జరిగినది, అందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి వైయస్ జగన్మోహన్ రెడ్డి గెలుపుకొరకు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. తామంతా టిడిపిలో దశాబ్దాలుగా ఉంటున్నప్పటికీ తమకి మాత్రం మేలు జరిగింది వైయస్ జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వంలోనేనని భవిష్యత్తులో తమకు మరింత మేలు జరుగుతుందని నమ్మకంతో తమ కుటుంబ సభ్యులుతో సమానులు అయిన జోగారావు సమక్షంలో తమ ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుందని నమ్మకంతో నేడు టిడిపిని వేడి వైసీపీలో చేరడం జరుగుతుందని పార్టీల చేరిన వారందరూ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-బెలగాం : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పార్వతీపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మండలం కృష్ణపల్లి పంచాయతీ ధనుంజయపురం రెవెన్యూ పరిధి పాలకొండ దాసు మామిడి తోటలో చెట్టు క్రింద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న విఆర్‌ఓ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుని వయసు సుమారు 30-35 సంవత్సరాల మధ్య ఉంటుందని, గ్రీన్ కలర్ ట్రాక్ ఫేంటు, నీలం రంగు ఫుల్ హాండ్స్ షర్టు ధరించి ఉన్నాడని, మాసిన గడ్డం, చామన చాయ సుమారు 5.5 అడుగుల ఎత్తు ఉంటాడని తెలిపారు. మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించి మార్చ్యురీలో భద్రపరచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పార్వతీపురం రూరల్ పోలీసులను సంప్రదించాలని తెలిపారు. రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ దినకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-సాలూరు రూరల్ : మండలంలో దేవి బుచ్చంపేట గ్రామంలో ఉన్న 132/33 కెవి విద్యుత్ ఉప కేంద్రంలో నేడు మరమ్మత్తులు నిర్వహిస్తున్నందున ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ వి.వి.కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉప కేంద్రం పరిధిలో ఉన్న 33/11 కెవి మామిడిపల్లి పీడర్‌తోపాటు గంగన్నదొర వలస సబ్ స్టేషను పరిధిలోఉన్న గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. శనివారం పైసబ్ స్టేషను పరిధిలో ఉన్న గ్రామాలలో విద్యుత్ పోల్స్ మార్గంలో చెట్ల తొలగింపు, సబ్‌స్టేషన్ మరమ్మత్తు చేపడుతామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

రేషన్ పంపిణీపై తహశీల్దార్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మున్సిపాలిటీ 24వ వార్డు లింగంవీధిలో రేషన్ డిస్ట్రిబ్యూషన్ వాలంటీర్స్ లేకుండా సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ అవుతున్నాయా లేదా అని శుక్రవారం పార్వతీపురం మండల తహశీల్దార్ కె.ఆనందరావు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆయన వెంట మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వి. రామకృష్ణ, హెచ్.డి.టి టివి రమణ, మౌలాలి వున్నారు.

గిరిజన గ్రామాలలో పోలీసుల కవాతు

విశాలాంధ్ర-పాచిపెంట : మండలంలో గల పనుకోవలసి పంచాయతీ కేంద్ర వలస గుంత మామిడి వలస చెరుకుపల్లి గిరిజన గ్రామాలలో ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు ప్రజలలో భయాన్ని తొలగించేందుకు ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు ప్రజలు స్వచ్ఛందంగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ కోరారు గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని ఆయన ఆయా గ్రామ ప్రజలను కోరారు.

ఆసుపత్రికి వెల్లి పెన్షన్ అందించిన సచివాలయం ఉద్యోగి

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని కోట సీతారాంపురం గ్రామానికి చెందిన పెన్షన్ దారుడు బొబ్బిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉండగా అతనికి సచివాలయం ఉద్యోగి శనివారం వెల్లి పెన్షన్ అందించినట్లు ఎంపిడిఓ ఈశ్వర రావు, ఈఓపిఆర్డీ వర్మ, సెక్రటరీ కామేశ్వరరావు లు చెప్పారు. శీతారాంపురంలో ఫెన్షన్ పంపిణీ కార్యక్రమంలో బొబ్బిలిహస్పిటల్ లో ఉన్న వృద్ధునికి ఫెన్షన్‌ను రంగంపేట సచివాలయ ఇంజనీరింగుఅసిస్టెంటు త్రినాథరావు అందించారు.

ఉమ్మడి పార్టీల అభ్యర్థి విజయ్‌చంద్ర గెలుపునకు కృషి

విశాలాంధ్ర-సీతానగరం : తెలుగుదేశం, జనసేన, బిజెపిపార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయ్ చంద్ర గెలుపుకు తమవంతు కృషి చేస్తున్నట్లు జనసేన మండల అధ్యక్షులు పాటి శ్రీనివాసరావు, ఐటీవింగు కోఆర్డినేటర్ పైలసత్యనారాయణ, రమేష్ సత్యనారాయణ, కె.ధనంజయనాయుడు, సాయి తదితరులు తెలిపారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. అంతా ఆలోచనచేసి విజయ్ చంద్రను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రావు జయంతి

విశాలాంధ్ర-దేవీపట్నం : స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఉపప్రధాని బాబు జగజ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలను శుక్రవారం దేవీపట్నం మండలం ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందుకూరుపేట గ్రామంలో జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు పల్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశా దీపం, దళిత జన బాంధవుడు, దేశ ఉపప్రధానిగా ఆయన అందించిన సేవలు మరువ లేనివి అన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి గోళ్ళ చంటిబాబు మాట్లాడుతూ జగజ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చెయ్యాలని అణగారిన వర్గాలు సమాజంలో అందరితో సమానంగా జీవిస్తున్నారు అంటే ఆ మహనీయుల కృషే అని అన్నారు. దళితులందరూ ఐక్యంగా ఉంటూ మహనీయుల ఆశయాసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చిర్రా చిట్టిబాబు అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఆర్ పిఎస్ జిల్లా, మండల నాయకులు పల్లపాటి నాగేశ్వరరావు, కొల్లి నాని, మిట్టపల్లి శ్రీను, పెనుముచ్చి రాజు, చిర్రా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల : స్వాతంత్ర్య సమర యోధుడు దళిత జాతి దీన భాందవుడు బాబు జగజ్జీవనరావు 116వ జయంతి వేడుకలు

అడ్డతీగల సెంటర్ లో కాంగ్రెస్ నాయకులు దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సత్తిబాబు మాట్లాడుతూ దళితుల ఆశాజ్యోతి సమ సమాజ స్థాపనకు ఎంతో కృషి చేశాన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని పెద్దలకు పిల్లలకు మిఠాయులు పంచి పెట్టారు.

సికిల్ సెల్ వ్యాధిని అరికట్టడంపై అవగాహన

విశాలాంధ్ర-దేవీపట్నం : సికిల్ సెల్ వ్యాధి నివారనే లక్ష్యంగా వ్యాధి పట్ల విస్తృత అవగాహనా కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని జిల్లా ప్రాజెక్ట్ అధికారి వారి ఆదేశాలు మేరకు అడిషనల్ హెల్త్ డిపార్ట్మెంట్ వారిచే మండలాల లో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లకు వెళ్లి ఆరోగ్య సిబ్బందికి సికిల్ సెల్, వడదెబ్బలు, గర్భిణీ స్త్రీలు ఆరోగ్య సమస్యలు సంబంధించి ఆరోగ్యశాఖ సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ పి.ఝాన్సీరాణి అన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం దేవీపట్నం మండలం ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో హెల్త్ ఎడ్యుకేటర్ ఝాన్సీరాణి ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టీ. డేవిడ్ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లకు, ఆరోగ్య సిబ్బందికి సికిల్ సెల్, అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల ప్రజల తీసుకోవలసిన జాగ్రత్తలు కోసం వివరించడం జరిగినది. ఈ సమావేశంలో గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గర్భిణీ స్త్రీల సంరక్షణ బాధ్యత పూర్తిగా ఆశ వర్కర్ల పై ఉన్నదని వడదెబ్బ కోసం తీసుకోవాల్సిన జాగ్రతలు గ్రామంలో ప్రజలకు వివరించాలాన్నారు. ఫీల్డ్‌లో తిరిగే ఆరోగ్య సిబ్బంది దగ్గర ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు తమ దగ్గర ఉండే విధంగా చూసుకోవాలని చెప్పడం జరిగినది ఈ సమావేశంలో ముఖ్య ఉద్దేశం దేశంలో సికిల్ సెల్ వ్యాధిని అరికట్టడమే దీని లక్ష్యం అని సికిల్ సెల్ టెస్టుల్లో డిసీజ్ ఉన్నవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలేసు అని చెప్పడం జరిగినది. ప్రస్తుతం వేడి గాలులు ఉక్కపోతలు ఎక్కువగా ఉండటం వల్ల మధ్యాహ్నం సమయం ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉన్న సమయంలో ప్రజలు బయట తిరగకుండా తగు జాగ్రత్తలు పాటించవలెనని గర్భిణీ స్త్రీలను వ్యాక్సినేషన్ల విషయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తీసుకెళ్లడంలో గాని పూర్తి బాధ్యతగా పనిచేయవలేను అని తెలియచేశారు. ఈకార్యక్రమంలో ఎంపిహెచ్ ఈఓ కోసు శ్రీనివాస్, పిహెచ్ఎన్ విజయకుమారి రమణ, వసంత ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు సచివాలయం ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను బీజేపీ ప్రభుత్వం దగా, మోసం చేస్తోంది : సీపీఎం

విశాలాంధ్ర-బెలగాం : బిజెపి ప్రభుత్వం కేంద్రంలో రాష్ట్రంలో ప్రజలను దగా, మోసం చేస్తుందనీ ప్రధానంగా గిరిజనులు, రైతులు, అట్టడుగు ప్రజల యొక్క చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కె. సుబ్బరావమ్మ అన్నారు. శుక్రవారం పార్వతీపురం సుందరయ్య భవనంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రధానంగా రాజ్యాంగంలోని మౌళిక సూత్రాలను పూర్తిగా తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తోందని, ఏజెన్సీ ప్రాంతంలో జీవో 3 ప్రకారం వంద శాతం గిరిజనులకు ఉద్యోగం ఇవ్వాల్సి ఉందని, గిరిజనులు పండించే పంటకు సంబంధించిన పంటలను జీసీసి ద్వారా పంపిణీ చేయాలని జీసీసీలను పటిష్టం చేయాల్సి ఉందని, అటవీ హక్కుల చట్ట ప్రకారం అడవులను పరిరక్షణ చేయాలని కానీ, నేడు బిజెపి ప్రభుత్వం అన్ని చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేసే పనిలో ఉందని అన్నారు. రాష్ట్ర విభజనలో బిజెపి రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందని, రాజధాని నిధులు మళ్లింపు, ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు, ప్రధానంగా గిరిజన యూనివర్సిటీకు సంబంధించి నిర్మాణం చేయకుండా కేంద్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో, దేశంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రానికి ఇంత అన్యాయం చేసిన బిజెపి పక్షాన తెలుగుదేశం, జనసేన ఎన్డిఏగా కూటమి కట్టడం అనేది రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేయడమనేది స్పష్టమౌతుందని వాపోయారు. ఒకవైపు స్టీల్ ప్లాంట్ లక్ష మందికి ఉపాధి కల్పిస్తుందని, మరోవైపు లక్ష కుటుంబాలను కాపాడుతుందని దానిని ప్రైవేటీకరణ చేయకుండా వాటికీ సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తున్నా కనీసం పట్టించుకోకుండా స్టీల్ ప్లాంట్ కు ముడి సరుకులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ వాటి ఆస్తులను ప్రైవేటుపరం చేస్తుందని రాష్ట్రానికి ఇంతటి అన్యాయం చేస్తున్న బిజెపిని ప్రతిఘటించాల్సిన టిడిపి, జనసేన కుమ్మక్కై ఎన్డీఏ పేరుతో ప్రజల వద్దకు వెళుతూ ఉండటం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. అందుకే టిడిపి జనసేన పార్టీలను ఓడించాలని, అంతేకాకుండా వైఎస్ఆర్సిపి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాల కన్నా ఈ ఐదేళ్లలో బిజెపి ప్రయోజనాలనే కంటికి రెప్పలా కాపాడుతూ పాలన కొనసాగించిందని వాపోయారు. కార్మిక చట్టాలు, ప్రభుత్వ పరిశ్రమల ప్రైవేటీకరణకు పూర్తి సహాయ సహకారాలు అందించిందని, బిజెపి ఎజెండాను తూచా తప్పకుండా జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తూ పరోక్షంగా బిజెపికి మద్దతు తెలుపుతున్నాడని కాబట్టి వైయస్సార్ పార్టీని కూడా ఓడించాలని సిపిఎం ప్రజలకు విజ్ఞప్తి చేస్తుందన్నారు. అందులో భాగంగా సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ ఉమ్మడి పార్టీలుగా ఒక నిర్దిష్టమైన అవగాహనతో ఇండియా కూటమిగా ఏర్పడి ఆంధ్ర రాష్ట్రంలో సిపిఎం పార్టీ పది అసెంబ్లీ స్థానాలలో, ఒక ఎంపీ స్థానంలో పోటీ చేయనుందని, అరకు ఎంపీ స్థానం నుండి అప్పలనరస పోటీ చేయనున్నారని, కురుపాం నియోజకవర్గం నుండి మండంగి రమణ పోటీ చేయనున్నారని, దాదాపు 5 ఏళ్ల నుండి వీరిద్దరూ ప్రజల తరపున పోరాడుతూ ఉండేవారని, 1/70 చట్టాన్ని పూర్తిగా తూట్లు పొడుస్తున్న ప్రభుత్వాలను, పీసా చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా అమలు చేస్తేదానికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. నేడు బిజెపి ప్రభుత్వం పత్రికల హక్కులను కూడా పూర్తిగా కాలరాస్తుందని, వారి యొక్క యూట్యూబ్ ఛానెళ్ళను పూర్తిగా రద్దు చేసే చర్యలు చేపడుతుందని అటువంటి చర్యలను ఖండించడానికి సిపిఎం అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు. అనేక రకాల గిరిజన మధ్య తరగతి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థులను ప్రజలు గుర్తించాలని, ప్రజా పోరాటాలకు మద్దతు ఇవ్వాలని సిపిఎం పార్టీ కోరతా ఉందన్నారు. ప్రజా పోరాటాలకు సంబంధించినటువంటి కార్మికులు, రైతులు, స్కీం వర్కర్లు అందరూ సిపిఎం పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని, ఈనెల 22వ తేదీన సిపిఎం పార్టీ కురుపాం అసెంబ్లీ అభ్యర్థిగా మండంగి రమణ నామినేషన్ వేయనున్నారని ప్రజలందరూ పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎం. కృష్ణమూర్తి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం విద్య రంగాన్ని కాషాయి కరణంగా చేసే ప్రయత్నం చేపడుతుండడం చాలా దుర్మార్గమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్య ఉమ్మడి రాష్ట్రాలలో ఉన్న జాబితాలో ఉంటే దానిని నిరంకుశంగా మనుధర్మ శాస్త్రాన్ని జోడించి కాషాయకరణంగా, మత ఉన్మాదులుగా చేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. వ్యవసాయం రాష్ట్రాల హక్కు దానిని హరించి కార్పొరేట్లకు తాకట్టు పెడుతుందని, విద్యుత్ రాష్ట్ర హక్కు దాన్ని కేంద్రం స్వాధీనం చేసుకొని ఉచిత విద్యుత్తు, సబ్సిడీలు లేకుండా చేస్తుందని ఇదే కాదు ఈ రాష్ట్రంలో ఎటువంటి కార్యక్రమం చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలే గానీ ఈరోజు కేంద్ర ప్రభుత్వం అనుమతి కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఎదురుచూస్తోందని ఇది అన్యాయమని అన్నారు. రాష్ట్రాల యొక్క పూర్తి హక్కులను హరించేస్తున్న బిజెపి, భారత రాజ్యాంగం యొక్క ఫెడరల్ స్వభావాన్ని హరిస్తుందని, భారత రాజ్యాంగం చాలా స్పష్టంగా చెప్పింది కులం, మతం, లింగం ఏమీ తేడా లేకుండా అందరూ రాజ్యాంగం ముందు చట్టం ముందు సమానులేనని, ఈరోజు బిజెపి దానిని మేము అంగీకరించబోమని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు మాకు వస్తే రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి వేస్తామని బహిరంగంగా ప్రకటించింది అంటే దాని అర్థం ఈ రాజ్యాంగాన్ని లేపేసి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తామని ప్రకటిస్తుండడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు. మరోసారి బిజెపి అధికారం చేపడితే బిసి,ఎస్సీ, మైనార్టీలకు ఉన్న రిజర్వేషన్ పోతుందని, వన్ ఆఫ్ ఫిఫ్త్, భూ హక్కు చట్టం కూడా రద్దు అవుతుందని ఏదైతే రాజ్యాంగం కాపాడే హక్కులున్నాయో దానిని పూర్తిగా చిన్నా భిన్నం చేసే ప్రయత్నం బిజెపి చేపడుతుందని కాబట్టి, బిజెపి, దానితో కలిసి ఎన్నికల్లో పోటీ చేసే టిడిపి, జనసేన పరోక్షంగా సహకరించే వైసీపీని కూడా ఓడించాలని కోరారు. కురుపాం అసెంబ్లీ అభ్యర్థి రమణను, అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్సను గెలిపించి చట్టసభలలో ప్రజల యొక్క వాణిని వినిపించుటకు, భవిష్యత్ తరాల కోసం సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా సిపిఎం కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె. అవినాష్, వై. మన్మధరావు, కొల్లి గంగునాయుడు పాల్గొన్నారు.

నా గౌరవానికి భంగం కలిగించిన వారి మీద చర్యలు తీసుకోండి

ఐ వి వి ప్రసాద్

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం రేకపల్లి గ్రామానికి చెందిన బిజెపి ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వి వి ప్రసాద్ కి బిజెపి పార్టీకి సంబంధం లేదు అని పత్రికా ప్రకటన నన్ను తీవ్రంగా బాధించిందని అధిష్టానం నిర్ణయం మేరకు అసెంబ్లీ కోఆర్డినేటర్ గా పత్రికా ప్రకటన ఇచ్చారని దాన్ని వక్రీకరించి నా గౌరవానికి భంగం కలిగించారని ఓ ప్రకటనలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల నుండి రాత్రింబవళ్లు ప్రజలతో మమేకమై పనిచేశాన ని మొట్టమొదటి సారిగా రేఖపల్లి సెంటర్లో బిజెపి జెండా ఎగరవేసిన వ్యక్తిని నేనేనని ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ నుండి తప్పుకోవాలని అనుకుంటున్నారని బిజెపి పార్టీలోనే కొనసాగుతానని ఏ కారణం లేకుండా ప్రజల ముందు పత్రిక ప్రకటన చేసిన వారి మీద పార్టీ హై కమాండ్ తగిన చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ కార్యకర్తలను కాపాడుకోవాలని ఆయన తెలియజేశారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర-బెలగాం : స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే చాలా ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారులు తమ నృత్యప్రదర్శన ద్వారా ఆహుతుల్ని అలరింపచేశారు. తమ చిట్టి పొట్టి మాటలు పాటలతో తమ ప్రజ్ఞా పాటవాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎజిఎం సురేష్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు గొప్ప స్థైర్యాన్ని ఇస్తుందని కొనియాడారు. ఆర్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలకి ఇటువంటి క్రమశిక్షణ ఎంతో అవసరమని అది శ్రీ చైతన్య తోనే సాధ్యమని ప్రశంసించారు. జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ మనోరమ మాట్లాడుతూ పిల్లలకు ప్రాథమిక స్థాయి నుండి చదువు పట్ల క్రమశిక్షణ పట్ల ఆసక్తిని శ్రద్ధని చూపాలని సూచించారు. ప్రిన్సిపాల్ జగదీష్ మాట్లాడుతూ మన పాఠశాలలో ఉత్తమ ఫ్యాకల్టీ చేత పిల్లలకు అన్ని విషయాల్లో శిక్షణ తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ పి. సుదర్శన్, సి బ్యాచ్ ఇంచార్జ్ రవికుమార్, టెన్త్ ఇంచార్జ్ మహేష్, ప్రైమరీ ఇంచార్జ్ సంధ్య, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ శ్రీలత, ఎఓ రామకృష్ణ ఇతర ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో కాశీపట్నం పంచాయతీలో పొలిట్ బ్యూరో, టీడీపీ, జనసేన, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి ప్రచార రథంపై నుండి అభివాదం చేస్తూ 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు, యువత వచ్చి పూలవర్షం కురిపించి, హారతులతో ఘనస్వాగతం పలికారు. యువత మాట్లాడుతూ, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మమ్మల్ని పట్టించుకోవటంలేదని, రోడ్లు, మంచినీటి సౌకర్యం, ఉపాధి, కల్పిస్తామని, చెప్పి నేటికీ కార్యరూపం దాల్చకుండా మోసం చేస్తున్నారని తెలిపారు. కొంతమంది మహిళలు, వృద్ధులు వచ్చి ఈ వేసవి కాలంలో నీటికొరత చాలా ఎక్కువగా ఉంటుందని, చాలా ఇబ్బంది పడుతున్నామని, మాకు అమ్మఒడి రాలేదని, గొర్రెల లోన్లు, పింఛన్లు లేవని, గర్భిణీ స్త్రీలకు వైటిసి ద్వారా మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందించి తల్లి, బిడ్డలను క్షేమంగా ఇంటికి పంపించేవారని టీడీపీ ప్రభుత్వంలో చాలా పథకాలు సంక్రాంతి కానుకలు, వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీతో వాహనాలు, వడ్డీలేని రుణాలు మొదలగునవి ఇచ్చేవారని ఇప్పుడు అలాంటివి ఏమీ రావటం లేదని వారు తెలిపారు. పొలిట్ బ్యూరో సభ్యులు, గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ రానున్న రోజుల్లో టీడీపీ గెలిచిన వెంటనే నిత్యావసరాల వస్తువుల అందరికీ అందుబాటు ధరలలో వుంటాయని, లబ్ధిదారులందరికీ అన్ని పథకాలు ఇస్తామని హామీ ఇచ్చారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రజలకు చంద్రబాబునాయుడు అందించబోయే సూపర్ సిక్స్ పతకాలను ప్రజలకు వివరిస్తూ, ఈ ఐదేళ్ళ జగన్ రెడ్డి ప్రభుత్వం పాలనలో జరిగిన అరాచకాలను, అకృత్యాలకు సవివరంగా వివరించడం జరిగింది. గత తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అందించిన దాదాపు 86 పథకాలను ఈ జగన్ రెడ్డి రద్దు చేసి ప్రజలను అన్యాయం చేసిన జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపవలసిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా ఆమె చెప్పడం జరిగింది. రాబోవు శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరుఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను గెలిపిస్తారని, ఒక్క అవకాశం ఇచ్చి, పార్టీలకతీతంగా సైకిల్ గుర్తుపై ఓటు వేసి, అత్యధిక మెజారిటీ అందించవలసినదిగా గ్రామ ప్రజలను సంధ్యారాణి కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్, మావుడి ప్రసాద్ నాయుడు, బొంగు వాసుదేవరావు, గొంగాడ భూషణ్ రావు, అక్యాన తిరుపతిరావు, చింతల తవిటినాయుడు, పట్నాన మల్లేశ్వరరావు, కారణం తిరుపతి అప్పారావు కేశవరావు శీను సంబర గ్రామ నాయకులు నైదాన తిరుపతి, అక్యాన మన్మధ, పుర్రి నారాయణరావు, బుడిసెట్టి గౌరీ, మింది సింహాచలం, గౌరీ నాయుడు, పెంట సత్యం తదితరులు పాల్గొన్నారు.

వైకాపాను ఆశీర్వదించండి... సుపరిపాలనకు సహకరించండి

వైకాపా పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు శ్రీకాంత్ రాజు

విశాలాంధ్ర-చింతపల్లి : వైకాపాను ఆశీర్వదించండి సుపరిపాలన కొనసాగింపుకు సహకరించండి అంటూ వైకాపా పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు శ్రీకాంత్ రాజు అన్నారు. ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ నేసు అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో మండలంలోని అంజలి శనివారం పంచాయతీలోని పలు గ్రామాలలో(అంజలం, వంటల మామిడి, కుడిసింగి, తామరపల్లి) ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులతో కలసి శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రజలతో మమేకమై గడచిన ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ పాలనలో ప్రజలకు జరిగిన మేలును, ఆదే క్రమంలో మన్య ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం వైకాపా సంక్షేమ పాలనకు ఆకర్షితులైన ఆ నాలుగు గ్రామాలకు చెందిన సుమారు 121 కుటుంబాలు వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. వారికి పాడేరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వర రాజు పాడేరు నియోజకవర్గ పరిశీలకులు శ్రీకాంత్ రాజులు ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, ఇతర ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సుపరిపాలన చూసి ఆయా గ్రామాలలోని ఇతర పార్టీలకు చెందిన పలు కుటుంబాలు వైకాపాలో చేరాయన్నారు. రాష్ట్రంలో మళ్లీ వైకాపా ప్రభుత్వం కొలువు తీరడం, ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడం ఖాయమని తద్వారా మరెన్నో సంక్షేమ పథకాలు కొనసాగించు కునేందుకు ప్రతి ఒక్కరు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైకాపా అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మోరి రవి, వైస్ ఎంపీపీలు గోపి నాయక శారద, సాగిన వెంగళరావు, లంబసింగి మాజీ సర్పంచ్ కొర్ర రఘునాథ్, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు, సీనియర్ నాయకులు జల్లి సుధాకర్, నాయకులకే కళ్యాణ్, బెన్నలింగం, అంగదరావు, బాబురావు, సదాశివ, నూకరాజు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల కళాజాత

విశాలాంధ్ర-రంపచోడవరం : రంపచోడవరం మండలం బి.వెలమల కోట సచివాలయం పరిధిలోగల జగమెట్లపలెం, నల్లగొండ, గొర్లగూడెం గ్రామాలలో డెంగ్యూ, సికెల్ సెలోమియ ,మలేరియా మొదలగు వ్యాధుల పట్ల కళా జాతర ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు ..ఇందులో సచివాలయం ఏ ఎన్ ఎమ్ ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు బక్కుపేట, పణుకుపేటగ్రామాల్లో ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-సీతానగరం : నేడు మండలంలోని బక్కుపేట, పణుకు పేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి అనుమతి ఇచ్చినట్లు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అధికారులు తెలిపారు. వైఎస్సార్సీపీ తరఫున బక్కుపేట గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు తన నాయకులతో కలిసి ప్రచారాన్ని సాయంత్రం పూట నిర్వహిస్తారని పార్టీఅధ్యక్షులు బొంగు చిట్టిరాజు తెలిపారు.టిడిపి ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర మండలంలోని పనుకుపేట గ్రామంలో ప్రచారాన్ని సాయంత్రం నిర్వహిస్తారని మండలపార్టీ అధ్యక్షులు సత్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి రౌతు వేణుగోపాల్ లుతెలిపారు ఈరెండు ప్రసార సభలకు అనుమతి ఉన్నట్లు అధికారులు చెప్పారు. రెండు కార్యక్రమాలని టీము అధికారులు రికార్డు చేస్తాయని చెప్పారు.

తనకు ఓటువేసి గెలిపించండి : వైసీపీ అభ్యర్థి జోగారావు విజ్ఞప్తి

విశాలాంధ్ర-పార్వతీపురం/బలిజిపేట : రాష్ట్రంలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గతఐదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలనుచూసితనకు రెండోసారి ఓటు వేసి ఎమ్మెల్యేగా చేయాలని సిటింగ్ ఎమ్మెల్యే,పార్వతీపురం వైఎస్ఆర్సిపి అభ్యర్థి అలజంగి జోగారావు తెలిపారు. శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని పార్వతీపురం పురపాలక సంఘంలో మండలంలోని, బలిజపేట మండలంలో ఎన్నికల అధికారుల అనుమతితో ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా మండలాల నాయకులు, నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం చేసారు. పలుగ్రామాల్లో కూడా వ్యక్తిగతంగా ప్రచారం నిర్వహించారు. పట్టణ ప్రజాప్రతినిధులు, మండల నాయకులతో కలసి నిర్వహించారు. నియోజకవర్గంలో గతఐదేళ్లుగా యెనలేని అభివృద్ధి పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. అందరికీ 24గంటలపాటు అందుబాటులో ఉండి ప్రజల కష్టసుఖాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు రెండోసారి అవకాశాన్ని ఇవ్వాలని ఇంటింటికి వెళ్లి విజ్ఞప్తిచేస్తున్నారు. పలు గ్రామాల్లో ఆయనవెళ్ళి అవ్వాతాతలని, అక్కా చెల్లెళ్ళను, యువతీ యువకులను, వయోజనులను, వికలాంగులని, వృద్ధులను కలిసి ఓటును వేయాలని కోరుతున్నట్లు తెలిపారు. తెల్లవారు జామునుండి రాత్రివరకు నేరుగా ఆయనే ఇంటింటికి వెళ్లి ప్రజలను, ఓటర్లను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. పలు గ్రామాల్లో జరిగిన వివాహ తదితర కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు పలువురిని పరామర్శ చేసే కార్యక్రమాల్లో కూడా పాల్గొంటున్నారు. ఇదిలాఉండగా సీతానగరం మండలంలోని వైఎస్సార్సీపీ ప్రజా ప్రతినిదులు,నాయకులు పలు గ్రామాల్లోకి వెళ్లి జోగారావుకు ఓటువేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రచారం చేస్తున్నామని తెలిపారు. బలిజిపేట మండలంలో జెడ్పీటీసీ అలజింగి రవికుమార్, ఎంపిపి ప్రతినిది జగన్మోహన్, వైస్ ఎంపిపి వెలిదిసాయి, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు మురళీ కృష్ణ తదితరులు పాల్గొని ప్రచారాన్ని నిర్వహించారు.పార్వతీపురం పట్టణంలో, గ్రామీణ ప్రాంతంలో కూడా ప్రచారాన్ని పార్టీనేతలు, ప్రజాప్రతినిదులు నిర్వహిస్తున్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి రావడంతో ఎమ్మెల్యే జోగారావు, వైఎస్సార్సీపీ నాయకులు వ్యక్తిగతంగా ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆయా గ్రామాల్లోని గుడులకు వెళ్ళి పూజలు నిర్వహించారు. బలిజిపేట, పార్వతీపురం మండలాల పరిధిలో జరిగిన ప్రచారాన్ని వివిధ టీములు నిశితంగా పరిశీలించి రికార్డు చేశారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ పట్ల అవగాహన

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : పల్లెల్లో ప్రాథమికంగా వైద్య సేవలందించే పీఎంపీలకు ప్రథమచికిత్స శిక్షణ ఎంతో అవసరమని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ మంచిపల్లి. శ్రీరాములు, పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి సింహాచలంఅన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో గాయత్రి కళాశాల విద్యార్థిని విద్యార్థులకు ఫస్ట్ ఎయిడ్ పట్ల అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరికైనా ఏదైనా అపాయం జరిగినప్పుడు నిపుణుల వైద్యం అందేవరకు తాత్కాలికంగా చేయు ఉపయుక్తకరమైన వైద్య విధానమే ఫస్ట్ ఎయిడ్ అని ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ పొంది చిన్నచిన్న గాయాలకు, సాధారణ శరీర రుగ్మతలకు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన సమయంలో, వ్యక్తి మంటల్లో చిక్కుకున్న సమయంలో, వ్యక్తి పాముకాటుకు గురియైన సమయంలో, ఎవరైని అపస్మారక స్థితిలో ఉన్నపుడు ఫస్ట్ ఎయిడ్ అందించి రోగి ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వివేక్, మణిబాబు రమేష్ తో పాటు పలువురు పిఎంపి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.